# నిజం తెలిసింది

రచన :
శ్రీ కలగర్ల నరసింహమూర్తి, బరంపురం

సురేష్ ఇంట్లో టెలిఫోన్ గణగణ మోగింది. సురేష్ భార్య కమల టెలిఫోను తీసుకొని 'హలో' అంది. 'సురేష్ ఆఫీసు నుండి యింకా యింటికి రాలేదా? ఆఫీసుకు ఫోను చేస్తే, సురేష్ ఆఫీసు విడిచిపెట్టి చాలా సేపయిందని తెలిసింది' అంది అవతలి కంఠం.

ఆ కంఠస్వరం బట్టి మాట్లాడుతున్నది ఆడదని, కమల తెలుసుకుంది. వెంటనే ఆమె ముఖం వాడిపోయింది. సురేష్‌కు ఆ ఊర్లో బంధువులెవ్వరూ లేరు. పైగా తనకు ఆడ స్నేహితులు కూడా ఉన్నారని అతడు ఎన్నడూ అనలేదు. టెలిఫోన్ తీసి అవతల మాట్లాడుతున్న వ్యక్తి ముఖాన గిరాటు వెయ్యాలనిపించింది కమలకు. ఏమీ జవాబు చెప్పకుండానే రిసీవర్‌ను ఉంచేసింది.

'ఇదా సంగతి! ఆయన వవరో ఆడదాని స్నేహాన్ని మరిగారు. రోజూ సాయంకాలం వేళ ఇంటికి ఆలస్యంగా రావడానికి కారణం ఇదేనన్నమాట. అతనికి తగ్గ గుణపాఠం నేర్పిస్తాను. నా అమాయకత్వాన్ని ఆధారం చేసుకొని, ఆయన తన ఇష్టం వచ్చినట్లు ఆడుతున్నారు' అనుకుంది కమల.

సురేష్ ఆ ఊర్లోని ఒక ప్రఖ్యాత బ్యాంకులో ఎక్కవున్‌టెంట్. అప్పుడే అతని కారు, తన ఇంటి కాంపౌండ్ దాటి లోపలికి వచ్చింది. సురేష్ తన కార్లో నుండి దిగి ఇంట్లోకి ప్రవేశించాడు.

'నాకు చాలా తొందర పని ఉంది కమలా! నాకు టీ త్రాగడానికి కూడా టైములేదు. కేవలం డ్రస్ మార్చుకోడానికే ఇంటికి వచ్చాను. మా మేనేజింగ్ డైరక్టరుగారి ఇంట్లోని బరగబోయే ఒక ముఖ్యమైన మీటింగుకు నేను హాజరుకావాలి. మళ్ళీ ఎంతసేపట్లో తిరిగి వస్తానో చెప్పలేను. భోజనం చెయ్యకుండా నా కోసం కాసుకుంటూ కూర్చోకు!' అలా మాట్లాడుతూనే తొందరగా తన డ్రస్ మార్చుకున్నాడు సురేస్. కనీసం కమల జవాబుకోసమైనా ఎదురు చూడకుండా, వెళ్ళిపోయాడు.

తన మనసును కొద్దిగా విప్పి చెప్పాలని కమల వాంఛించింది. కానీ అందుకు తగ్గ అవకాశం ఆమెకు లభించలేదు. సురేష్ ఆమెకు అటువంటి అవకాశాన్ని కల్పించలేదు. అవును! అతడు వంచిస్తున్నాడు. ఆ ఆడ స్నేహితురాలిని కలుసుకోడానికే అతడు వెళుతున్నాడు. ఈ కొద్ది రోజులై సురేష్‌లో ఏదో చెప్పరాని పెద్ద మార్పు వచ్చింది. భార్య విషయం అతడు బొత్తె పట్టించుకోవడం లేదు. అతని మనసు దేనితోనో నిండిపోయినట్లు కనిపిస్తూ ఉంది. దీనంతటికి కారణం ఆ ఆడ రాక్షసి కాక ఇంకెవరు? ఆ రాక్షసితో ముఖాముఖిని మాట్లాడే ఒక్క అవకాశం తనకు లభిస్తే ఎంత బాగుండేది? ఇలా ఆలోచిస్తూ ఉంటే, కమల కళ్ళల్లో గిఱ్ఱున నీళ్ళు తిరిగాయ్.

తమ వివాహమై, ఇంకా పూర్తిగా ఒక ఏడాది కూడా నిండలేదు. అతడలా మారిపోవడానికి కారణం ఏమిటి? ఎంతగా ఆలోచించినా కమలకు జవాబు దొరకలేదు.

'ఇదేవిధంగా ఆయన తన ప్రవర్తనను కొనసాగిస్తే, నేను మూటముల్లే కట్టుకొని పుట్టింటికి పోవాల్సిందే. నేను దేనినైనా సహించగలను గానీ, అతను ఇంకొక ఆడదానితో తిరిగితే మాత్రం సహించలేను!' అని తనలో తాను అనుకుంది కమల. కమల తలిదండ్రులు బెంగుళూరులో ఉన్నారు. ఆ తలిదండ్రులకు కమల ఒక్కర్తే సంతానం. సురేష్, తనను ఇలా వంచించాడని తెలిస్తే ఆ ముసలి ప్రాణాలు ఎంత బాధపడతాయో కదా, అనుకుంది కమల.

చాలా రాత్రి గడచిన తర్వాత సురేష్ ఇంటికి వచ్చాడు. కమల నిద్రపోతున్నట్లు నటించింది. ఆ రాత్రి ఆవిడ ఏమీ తినలేకపోయింది. సురేష్ తన నైట్ డ్రస్ వేసుకొని, బెడ్‌మీద వాలి, కొద్ది క్షణాల్లోనే గాఢమైన నిద్రలో మునిగిపోయాడు. ఆ రాత్రంతా కమలకు నిదర రాలేదు. ఒక్క క్షణం కన్ను మూసినా, ఆవిడకు ఏవేవో భయంకరమైన కలలు రాసాగినాయ్.

ఆ మర్నాడు సురేష్ చాలా వేగంగా లేచి, కాఫీ ఫలహారం పుచ్చుకొని ఆఫీసుకు వెళ్ళడానికి సిధ్ధంగా ఉండగా కమల, నిద్ర నుండి లేచింది. కమల ముఖం బాగా వాడిపోయినట్లు కనిపించింది సురేషుకు.

'కమలా, డియర్! నీ ఒంట్లో బాగాలేదా? ఇవాళ ఇంత ఆలస్యంగా లేచావేం?' అన్నాడు ఆప్యాయంగా.

'మీరు ఇవాళ ఇంత వేగంగా వెళుతున్నారేం? మీ మేనేజింగ్ డైరక్టరిగారింట్లో మీటింగ్ ఇంకా ముగియ లేదా? అలా కమల తన భర్తను ఎన్నడూ ప్రశ్నించ లేదుగానీ, ఆనాడు మాత్రం ఆవిడ తన మనస్సును అదుపులో ఉంచుకోలేక పోయింది.

'అవునవును కమలా! బ్యాంకు తెరిచేలోగా, మేమంతా కలసి కొన్ని ముఖ్యమైన విషయాలను గురించి చర్చించాలి!' అంటూ సురేష్ తొందరగా వెళ్ళి కారులో కూర్చున్నాడు. కొద్దిసేపట్లో కారు బయలు దేరింది,

'ఏవిటీ గారడీ!' అనుకుంది కమల. అతడు బ్యాంకు విషయం చెప్పకముందే, తను ఇంటి వ్యవహారాలను గురించి మాట్లాడాలనుకుంది. ఆ ఆడదెవరో గానీ, ఇతనికి అదంటే మహా మోజులాఉంది. దానివెంట పిచ్చి వానిలా తిరుగుతున్నారు కాబోలు. ఆఫీసు వేళలు మినహాయించి, మిగతా రోజంతా దానితో గడుపుతున్నట్టుంది. కమల కోపంతో ఒళ్ళు మరచిపోయింది. వెంటనే వేరే ఆలోచన లేకుండా కమల తనపెట్టే బేడా సర్దుకొని, మధ్యాహ్నం మెయిల్ బెంగుళూరుకు వెళ్ళి పోదామని నిశ్చయించుకుంది.

'ఇంటికి తిరిగి వచ్చినతర్వాత తెలుస్తుంది బాబుగారికి, నా అవసరం ఎటువంటిదో! కమల వెఱ్ఱి బాగుల జాతికి చెందినది కాదని ఇహనైనా తెలుసుకుంటారు' అని తనలో తానే అనుకొని, టాక్సీకోసం ఫోను చేసింది, ఆ పూట కమల భోజనం కూడా చెయ్యలేదు. ఇంటి నౌకరు గురవయ్యను పిలిచి తనకు మనస్సేమీ బాగో లేదని, మార్పుకోసం పుట్టింటికి వెళుతున్నానని చెప్పి, టాక్సీలో స్టేషనుకు బయలుదేరింది. తొందరగా బుకింగ్ ఆఫీసుకు దగ్గరకు వెళ్ళి బెంగుళూరుకు ఒక ఫస్ట్‌క్లాస్ టికెట్ తీసుకుంది. ట్రైన్ రాగానే, ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులోనికి ప్రవేశించి, మంచి సీటులో కూర్చుంది. పది నిమిషాల్లో రైలు బయలుదేరింది.

వారికి, వారి వైవాహిక జీవితానికి తుది వీడ్కోలు! గారడీలు ఇహ సాగవు! ఎప్పుడైనా, వారు తన దగ్గరకు వచ్చి, పాదాలపై బడి కన్నీరు కారుస్తూ క్షమించి తిరిగి రమ్మని కోరినాసరే, తను లొంగి అతనివెంట రాకూడదని నిశ్చయించుకుంది కమల. తన ఎదురుగుండా బెర్తులో కూర్చున్న ముసలావిడను గమనించనే లేదు.

ఆవిడ, కమల వంక తదేక ధ్యానంతో చూసి 'అమ్మడూ? ఏదైనా పొరపాటు జరిగిందా!' అంది, ఆ మాటలు విని కమల త్రుళ్ళిపడి 'అబ్బెబ్బే! ఏమీలేదండీ! అంటూ నీళ్ళు నమిలింది.

ముసలావిడ ఎంతో ఆప్యాయంగా కమల వంక చూస్తూ? చూడమ్మా? వయస్సులో పెద్దదాన్ని. నీకు తల్లిలాంటి దాన్ని. అడుగుతున్నానని మరేమీ అనుకోకమ్మా. నువ్వేదో విషయాన్ని తలంచుకొని బాధపడుతున్నట్టున్నావ్! నేను నీకేదైనా సహాయం చెయ్యగలనా అమ్మడూ!' అంది.

కానీ కమలకు ఈ అమ్మమ్మ సహాయం ఏమీ అక్కర్లేదనిపించింది. 'ఈ ముసలావిడ కాదుకదా, ఇంకెవ్వరూ, ఏవిధంగా ప్రయత్నించినా సరే, నా సమస్య పరిష్కారం కాదు' అనుకుంది కమల.

కమలకు ముసలావిడ వట్టి వాగుడుకాయలా కనిపించింది. తన ఏకాంతాన్ని ఎవ్వరూ భగ్నం చెయ్యకుండా తనను అలా ఒంటరిగా విడిచిపెడితే చాలుననుకుంది.

'ఎక్కడదాకా వెళుతున్నావమ్మా' ముసలావిడ తిరిగి ప్రశ్నించింది.

'బెంగుళూరు' కమల క్లుప్తంగా జవాబు చెప్పింది.

ముసలావిడ ఎంతో ఉత్సాహంగా కమల వంక చూసి 'నేనుకూడా బెంగుళూరే వెళుతున్నానమ్మా! అక్కడనుండి మొన్ననే ఈ ఊరుకు వచ్చాను. 'అంటూ ముసలావిడ అప్రయత్నంగా తన దృష్టిని కమల సూట్‌కేస్‌మీదకు పోనిచ్చింది. ఆ సూట్‌కేస్‌మీద ఉన్న 'కమలా సురేశ్' అనే అక్షరాలు ఆ ముసలావిడను బాగా ఆకర్షించినాయ్.

'కమలా సురేష్' అని అవిడ తిరిగి కమలవంక చూసి 'అమ్మడూ! ఈ పేరు చదువుతుంటే, బ్యాంకులో పని చేస్తున్న సురేష్ అనే అబ్బాయ్ జ్ఞాపకం వచ్చాడమ్మా ఆ కుఱ్ఱవాడు మాంచి తెలివైనవాడు. బుద్ధిమంతుడు. అతను నీకు తెలుసునా అమ్మా!' అంది.

కమలకు ఆ సంభాషణ విసుగు కలిగించింది. జవాబు ఇవ్వకుండా నిశ్శబ్దంగా కూర్చుంది. ముసలావిడ మాత్రం

తన ధోరణిలోనే సాగిపోతూ 'అమ్మడూ! ఈ సురేష్ లాంటి బుద్ధిమంతుణ్ణి, తెలివైనవాణ్ణి నేను ఇంతవరకూ చూడలేదంటే నమ్ము! అమెరికాలో ఇప్పుడు చదువుతున్న నా మనుమడు, ఈ సురేష్ వీళ్ళిద్దరూ ఒకప్పుడు బియ్యేవరకూ ఒక కాలేజీలో చదువుకున్నారు, ఇప్పుడు సురేష్ పనిచేస్తున్న బ్యాంకు గురించి కొన్ని గాలి వార్తలు చెడ్డవి విన్నాను. నాకు ఈ బ్యాంకులో ఖాతా వుంది. ఆ వార్తలలోని నిజానిజాలు తెలుసుకుందామని మొన్ననే బెంగుళూరు వచ్చి సురేష్‌ను. ఆనాడే కలుసుకున్నాను. ఆ గాలివార్తలన్నీ అబద్ధమని, బ్యాంకులో దాచుకున్న డబ్బు గురించి నాకెట్టి భయమూ వద్దని' సురేష్ నాకు విషయాలన్నీ ఎంతో వివరంగా బోధించాడు, అతని మాటలు విన్నతర్వాతనే నా భయం పోయిందమ్మా! నేను ఇలా బెంగుళూరుకు వెళ్ళిపోతున్న సంగతి సురేష్‌కు తెలియజేయలేక పోయాను. ఏం చేసేదమ్మా! నిన్న నాలుగుగంటలకు బ్యాంకుకు ఫోనుచేస్తే, సురేష్ ఇంటికి వెళ్ళిపోయాడని తెలిసింది. వెంటనేఅతని ఇంటికి కూడా ఫోను చేసాను. కానీ ఇంట్లో కూడా లేడు కాబోలు. ఎవరో పసిపిల్ల, బహుసా కొత్త పెళ్ళికూతురో ఏమో, నా ప్రశ్నకూ పూర్తిగా జవాబైనా ఇవ్వకుండా ఫోను పడేసింది. కొంపతీసి ఆ అమ్మాయిని నువ్వేనా ఏం?'

ఎవరో తన చెంప చెళ్ మనిపించినట్లయింది కమలకు. తల గిఱ్ఱున తిరిగిపోతూఉంది. అంటే నిన్న టెలీఫోనులో మాట్లాడింది ఈ ముసలి మామ్మన్నమాట! నిర్దోషియైన సురేష్ ఎడల, తనెంత వివేక శూన్యంగా ప్రవర్తించిందో ఇప్పుడు కమలకు అర్థమయింది. కన్నీళ్లు కారి ఆమె చెంపలమీదుగా జారిపోయాయి. ఆ అమాయికురాలి మనసంతా ఇప్పుడు సురేష్‌తో నిండిపోయింది 'ఓ ముసలిమామ్మా! నిన్నటి ఈ టెలిఫోన్ మాటల మూలంగా, మా భార్యాభర్తల మధ్య ఎంత పెద్ద రభస జరిగిందనుకున్నావ్?' అని పాపం కమల, ఆ ముసలావిడతో ఎలా చెప్పగలదు?

రైలు మాత్రం తొందరగా పరుగులుతీస్తూ గమ్యాన్ని చేరుకోవాలని తాపత్రయ పడుతోంది.

# రచయితలకు మనవి

○

యథారీతిగా 'కథాంజలి' జన్మదిన సంచిక జూన్ నెల 15 వ తేదీన (15-6-62) వెలువడబోతుంది.

కథాంజలి పత్రిక పుట్టిన నాటినుంచి ఇన్నేళ్ళవరకు తన ఆశయాలను ఎంతవరకు నెరవేర్చుకుందో మీకందిరకూ తెలుసు.

ఈ సంవత్సరం వెలువడుతున్న జన్మదిన సంచిక వినూత్న అకార ఆశయాలతో అలంకరించబడుతోంది. ఈ ప్రయత్నంలో రచయితలైన మీ సహకారం ఎంతో అవసరం 'కథాంజలి' ఏ ఆశయంతో పుట్టిందో ఆ ఆశయాలు ప్రతిబింబించే రచనలను సాగించి అలంకరించే బాధ్యత మీ మీదనే ఉంది.

అందుచేత చక్కని అధునాతన స్వతంత్ర రచనలను అచ్చులో మూడు పేజీలు మించకుండేటట్లు వ్రాసి వచ్చే నెల 15 వ తేదీలోగా (15-5-62) మా కార్యాలయం చేరేటట్లు పంపాలి.

ఈ సంచికలో చాలా ఎక్కువ రచనలు ప్రకటించాలని చూస్తున్నాను. అచ్చులో మూడు పేజీలకు సరిపడేటట్లు రచనలను సాగించినట్లయితే రచనల సంఖ్య ఎక్కువకా ప్రచురించడానికి వీలౌతుంది. ఈ నియమాన్ని మాత్రం మీరు విధిగా పాటించాలని కోరుతున్నాను.

—సంపాదకుడు.